చెన్నుపాటి స్మారకసంచిక

# ఐక్య ఉపాధ్యాయ

సంపుటి 4 ★ సంచిక 12 ★ డిశంబరు 1978

## అన్నా! లక్ష్మన్నా!

ఇది పర్వదినం
గురుకులానికి గర్వదినం!
కన్నుగానని చీకటిలో
వెన్నెల గురిపించిన
చెన్నుపాటి వర్ధంతి దినం!
స్పర్థల, స్వార్థాల మరచి
సర్వోపాధ్యాయ సంఘాలు
సమిష్టి ప్రయోజన సాధనకై
సాగించాల్సిన సమరదినం!
మెతుకులు కరవై
చితికే బజ్జల పజ్జజేరి,
ఉజ్వల భవితవ్యంజూపి
ఉద్యమరూపంలో ఉరవడింపజేసిన
ఓ అన్నా! లక్ష్మన్నా!
అందుకో మా జోహార్!

— ఆర్. కె. మొగసాటి



...o. 1

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయఫెడరేషన్ అధి...

...EST CIRCULATED TELUGU EDUCATIONAL...

# పాఠకుల అభిప్రాయాలు

నవంబరు కార్టూన్ ఎంతో చైతన్యస్ఫోరకంగా ఉంది.

— జి. చిట్టెయ్య, కాకినాడ.

సంపాదకీయం సందర్భోచితంగా ప్రభుతకు కనువిప్పు కలిగించేదిగా ఉంది. ప్రస్తుత విద్యాలయాలను పట్టిపీడిస్తున్న దుష్ట శక్తులు కార్టూన్‌లో చక్కగా చిత్రింపబడ్డాయి. కొన్ని శీర్షికల్ని కుదించి విద్యావిషయిక వివిధ సాహిత్య ప్రక్రియలకు విశేషస్థానం కల్పిస్తే పత్రిక మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

— జి. శ్రీహరి, పెదకాపర్తి.

శ్రీ లోకంగారి కార్టూన్లు పత్రికకు ఎంతో శోభను తెస్తున్నాయి. "బతకనేర్పున్ని" కథ ఏకోపాధ్యాయుని దుస్థితికి ప్రతిబింబం. గేయాలు మానవతా దృక్పథానికి అద్దంపడుతున్నాయి.

— యన్. చక్రపాణి, కల్వకుర్తి.

మన బాలల ప్రపంచాన్ని సోషలిస్టుదేశాల బాలల ప్రపంచముతో పోల్చి సంపాదకీయంలో చక్కగా తేటపరిచారు. ఉపాధ్యాయుని దుర్భరస్థితి "పాపం పంతులు" గేయంలో ప్రతిభావంతంగా చిత్రీకరింపబడింది.

— యన్. విష్ణుమూర్తి, ఎల్లికల్లు.

విద్యారంగాన్ని వేధిస్తున్న దయ్యాన్ని ముఖచిత్రంలో చక్కగా చిత్రించారు.

— చింతా నాగేశ్వరరావు, నవుడూరు.

వసివాడిపోతున్న పసిబాలల్ని, వారా దుస్థితిలో ఉండటానికి గలకారణాల్ని, సంపాదకీయంలో చక్కగా చిత్రించారు. "పాపం పంతులు" కవిత మెదడుకు మేతవేసింది.

— బి. మల్లయ్య, ఆర్పల్లి.

ముఖచిత్రంలో విద్యారంగాన్ని పీడిస్తున్న పంచభూతాల్ని చక్కగా చిత్రించారు అంతేగాదు. ప్రతి సంపాదకీయం ఉపాధ్యాయుల్లో చైతన్యాన్ని కల్గిస్తూ, దుష్టవిధానాలను ఎండగట్టుతున్నది.

— వై. వెంకట్రావు, వేదంగి.

జనవరి నుండి ధరపెంచి పేజీలు ఎక్కువచేయండి.

— వి. యస్. రాజస్వామి, పెదమిరం.

మహాసభల విశేషాల్ని చిత్రాలతోసహా ప్రచురిస్తున్నందుకు ధన్యవాదాలు

— వి. ప్రకాశరావు, పెద్దాపురం.

మొదటిసారిగా పత్రిక చూశాను. అన్ని శీర్షికలు ఉపాధ్యాయులకు ఉపయోగకరంగాఉన్నవి. ప్రశ్నోత్తరాల శీర్షిక పెంచండి.

— యం. రామనరసింహ, జనగాం.

...బరు నెల సంచికలో ఉద్యోగుల సంక్షేమానికి పశ్చిమ ...గ ప్రభుత్వం తీసుకున్న చర్యలు జి.ఓ. నెంబర్లతో ...తన్యపరిచినందుకు నా ధన్యవాదాలు.

— కె. శేషయ్య, బూదివంపాడు.

# సంపాదక లేఖలు

## అక్రమ ఎన్నికలు

ఉదయగిరి సమితిలోగల ఉపాధ్యాయులు, ఆఫీసు సిబ్బంది సుమారు 300 మంది నుండి సూపరుబజారు సభ్యత్వ రుసుంక్రింద 76 సం॥ జనవరి 3, 4 తేదీలలో సమితివారు వసూలుచేసి, సూపరు బజారుకు బ్యాంకుద్వారా జమచేసినారు. అందులో 50 మందికితప్ప తక్కినవారికి యీనాటివరకూ రశీదులుయివ్వక సభ్యత్వం కల్పించక పోగా తర్వాత చేర్చుకున్నవారితో 25-11-78 తేదీన ఎన్నికజరుపుట అన్యాయము. అక్రమైన చర్యగా భావించుచున్నాము. కాన ముందు చేర్చుకున్నవారందరికీ సభ్యత్వం కల్పించి ఎన్నికలో పాల్గొనే అవకాశము కల్పించినమీదటనే ఎన్నిక జరిపించాలని కోరుతున్నాం.

కె. నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి,
యు టి.యఫ్. ఉదయగిరిశాఖ, నెల్లూరు జిల్లా.

## ఉపాధ్యాయుల కుటుంబములకు రక్షణకల్పించాలి

ముమ్మిడివరం సమితి ఉపాధ్యాయులైన శ్రీ దంగేటి మాణిక్యం గారు యింటలేని సమయమున వారి కుటుంబముపై రౌడీలు రెండు సార్లు దాడిచేసి భీభత్సముచేసి వెళ్ళిరి. ఈ విషయము గ్రామాధికార్లకు, పెద్దలకు విన్నవించుకొనగా సరిదిద్దుతామని చెప్పి పంపివేసిరి. మరల మాణిక్యంగారు గ్రామాంతరమున నుండగా భార్య శ్రీమతి ఛాయాదేవిని, కుమార్డు రామచంద్రశేఖరరావు, వెంకటరమణను చాల విపరీతముగా కొట్టిరి. శ్రీమతి ఛాయాదేవి స్పృహ కోల్పోయిన తరువాత చనిపోయినది అని విడిచివెళ్ళిరి. రామచంద్రశేఖరరావును రాయితో నెత్తిమీద కొట్టిరి. గ్రామస్తులు వీరిని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళి కట్లుకట్టించి పోలీసువారికి రిపోర్టుచేయుటకువెళ్ళగా అవతలవారు ముందుగా పోలీసు రిపోర్టుయిచ్చి కేసు నమోదుచేయించిరి. ఈ విషయము గ్రామపెద్దలకు తెలిసి, సర్పంచి గారిద్వారా కేసు రాజీచేసిరి. నెత్తిమీద తగిలిన రాయిదెబ్బవలన నరములు నలిగి కన్ను చీముపట్టి అమలాపురంలో స్పెషలిస్టుచేత వైద్యము చేయించుచున్నాము. కాన ఉపాధ్యాయులకు సరియైన రక్షణ కల్గించమని ప్రభుత్వమువారిని కోరుచున్నాము.

ముమ్మిడివరం సమితి యు టి యఫ్. శాఖ
తూ. గో. జిల్లా.

## 7గురు లెక్చరర్లులేని రాజమండ్రి బి. యిడి. కాలేజీ

రాజమండ్రి గవర్నమెంటు బి.యిడి. కాలేజీలో గత కొలది మాసాలుగా 7 గురు లెక్చరర్లు లేరు. రిటైరయిన బదిలీలయిన లెక్చరర్ల పోస్టులను భర్తీచెయ్యకుండా అలానే అట్టిపెడుతున్నారు. ఒకప్రక్క అధ్యాపకులకు మంచి శిక్షణ యివ్వాలనిఅంటూ వేరొకప్రక్క బోధించే అధ్యాపకులు లేకుండా కాలేజీలు నడుపుతున్నారు. దీన్నిబట్టి విద్యావిషయంలో మన ప్రభుత్వ అలసవైఖరి చెప్పకుండానే విదితమవుతున్నది. కనుక వెంటనే ఈకాలేజీలో కావలసిన లెక్చరర్లనువేసి, కాబోయే అధ్యాపకుల చదువు కుంటుపడకుండ చూడవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

కె. యఫ్. సాలమన్‌రాజు,
ప్రధానకార్యదర్శి, రాజమండ్రి పట్టణ యు టి

IKYA UPADHYAYA

Life Subscription 116-00
Yearly „ 10-00
Single Copy 1-00

Ikya Upadhyaya
Palapartivari Street,
Vijayawada-2
520002

# ఐక్య ఉపాధ్యాయ

సంపాదకవర్గం:
మైనేని వెంకటరత్నం
(ప్రధాన సంపాదకుడు)
కోడూరు నారాయణరావు
అప్పారి వెంకటస్వామి

సంపుటి 4 డిశంబరు 1978 సంచిక 12

## సంపాదకీయం

# మన చెన్నుపాటి

అమరజీవి చెన్నుపాటి ఒక వ్యక్తికాదు. ఒక మహా సంస్థ.

ఆయన ఉద్యమాలకిచ్చిన ఊపిరి, మేనేజిమెంటుల్ని, కేట గిరీల్ని ప్రాంతీయభేదాల్ని అధిగమించే సత్తాగలది.

అందువల్ల ఆయనఅన్నిరకాల, అన్నిప్రాంతాల ఉపాధ్యాయు లకు చెందిన మనిషి

ఆయన తీర్చినవరవడి పీడితోపాధ్యాయుల విముక్తికిఉరవడి

ఆయన ఆదర్శాలు సకలమానవ విముక్తి మార్గదర్శకాలు.

ఆశయాలు–ఆచరణ ఒకటిగా నడిపింపజేసిన చిత్తశుద్ధి ఆయనది.

తన జీవితాన్ని పీడితో పాధ్యాయుల సేవలో కొవ్వొత్తిలా కరిగింపజేసి ఉద్యమాలకు ఊపునిచ్చి వెలుగుబాట చూపిన ధన్యజీవి ఆయన.

ప్రాథమిక రంగంలోనే కాదు.... సెకండరీ.... కాలేజీస్థాయిల్లో గూడా ప్రజాసంఘాల నిర్మాణంలో ఆయననెలకొల్పిన సాంప్రదా యాలు అందరికీ శిరోధార్యాలు.

—అందుకే ఆయనొక మహాసంస్థ.

ఉపాధ్యాయులే తన కుటుంబమనుకొని, వారిసంక్షేమం కోసం హక్కుల రక్షణకోసం, విద్యారంగ అభివృద్ధికోసం సమస్తాన్ని త్యాగం జేసిన చెన్నుపాటిపేర కనీసం ఒకస్మారకచిహ్నమైనా లేక పోవటం ఉపాధ్యాయులకు తీరనిలోటుగా, ఉద్యమానికే అవమాన కరంగాభావించింది యు.టి.యఫ్. ఆలోటు పూర్తిచేయటానికి ఖమ్మం మహాసభలో పిలుపుఇచ్చింది.

ఒకఏడాదికాలంలోనే ఉపాధ్యాయులుఆపిలుపునందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలనుండి విరాళాలందించారు. ఆయన ఒక వర్గానికి, ఒకప్రాంతానికి చెందినవాడుకాదని నిరూపించారు.

మన కలలు వాస్తవాలయ్యాయి. ఆయన పదవ వర్ధంతినాడు 78 డిశంబరు 9న విజయవాడ, గవర్నరుపేట, పాలపర్తివారివీధిలో 'చెన్నుపాటి భవన్'కు ప్రారంభోత్సవం జరిగింది. ఆయన సహ చరుడు, యు. టి. యఫ్. ఉపాధ్యక్షుడు శ్రీ నాదెళ్ళ సీతారామాచారి దానినావిష్కరించారు. ఆ ఉత్సవాన్ని అన్ని జిల్లాల నుండి వచ్చిన వేయిమంది కార్యకర్తలు, ఉద్యమాభిమానులు తిలకించి నివాళు లర్పించారు.

ఆయన ఆశయాల కనుగుణంగా పనిచేస్తూ యు. టి. యఫ్. అచిరకాలంలోనే అప్రతిహతంగా పురోగమించింది. 'ఆయన బ్రతి కుండగానే కాదు. మరణించిన తర్వాతగూడా ఒక మహోద్యమానికి ఊపిరిగా, ఉత్తేజకరశక్తిగా భవనరూపంలో ప్రతిబింబింప జేసింది.'

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఎంత కఠిన కాలంలోకూడా ఎట్టి భ్రమలకు లోనుగాక ఖచ్చితంగా ఉపాధ్యాయుల పక్షనే నిలబడి పనిచేసింది....పనిచేస్తుంది కూడా. అందుకు కలిసివచ్చే అందరితో సమైక్య ఉద్యమం నిర్మించుతుంది. తన ప్రచార సాధనాలన్నీ దానికే ఉపయోగిస్తుంది. సూత్రబద్ధ వైఖరితో ముందుకు పోతుంది. అదే చెన్నుపాటి చూపినబాట.

–ఈ పదవ వర్ధంతి సందర్భంగా ఆ బాటకు, ఆ ఆశయాలకు పునరంకితమౌతూ యు. టి. యఫ్. శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

## జోహార్లు

—శ్రీ కె. గంగిశెట్టి.

జైజై మా లక్ష్మయ్యా!
చెన్నుపాటి లక్ష్మయ్యా!
అందుకొమ్ము నివాళులు!
అధ్యాపక జోహారులు!
    పందలాది వత్సరాలు
    బందీయై యున్ననాటి
    బడిపంతులి హక్కులకై
    బాధ్యతగా పోరేవు
    ఆశాజ్యోతివి నీవై
    అండదండ లందించావ్!
నీ నిర్మిత ఉద్యమాల
నిజరూపమె యు.టి.యఫ్.
నీ శిక్షణ గొన్నవారె
నేటి దాని నాయకులై
నీ ఆశయ సిద్ధికొరకు
తరకంటా నిలుస్తారు!
తడబడకనె నడుస్తారు!




## ఫేప్టో దశలవారీ పోరాట కార్యక్రమం

78 డిశంబరు 17.18 తేదీలలో హైదరాబాద్‌లో ఫేప్టో కార్య వర్గం సమావేశమై ఉపాధ్యాయసమస్యల పరిష్కారానికి యీ క్రింది దశలవారీ పోరాట కార్యక్రమం నిర్ణయించింది.

1. 78 డిశంబరు 24 నుండి 79 జనవరి 4 వరకు కార్డ్సు క్యాంపెయిన్.

2. జనవరి 4 వ వారంలో సమితి, జిల్లాస్థాయిల్లో నల్ల బ్యాడ్జీలు ధరించుట, ధర్నా నిర్వహించుట.

3. ఫిబ్రవరిలో 'మార్చ్ టు అసెంబ్లీ'.

—పై కార్యక్రమానుసారం ముఖ్యమంత్రికి పోస్ట్ చేయవలసిన కార్డు నమూనా దిగువ ఇస్తున్నాం. స్థానిక యూనిట్లు ఎవరికి వారే ప్రింటు చేసుకొని ప్రతి ఉపాధ్యాయునిచే పోస్టు చేయింపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

### కార్డు నమూనా

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫేప్టో)

గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గార్కి—

ఆర్యా,

విద్యా రంగానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి సంబంధించిన యీ క్రింది అత్యవసర సమస్యలను తక్షణమే పరిష్కరించ గలందులకు ఫేప్టో ఆదేశానుసారం మీ ముందుంచు తున్నాము.

1. విద్యాశాఖను విభజించిన ప్రభుత్వ ఉత్తర్వులు 706 తేది. 5-12-78 మరియు 788 తేది 30-6-75 ఉపసంహరించాలి.

2] అభ్యుదయ ప్రాథమిక విద్యాసంస్థను రద్దుచేయాలి.

3. 1-10-78 నుండి రిటైరయిన ఉపాధ్యాయులను విద్యా సంవత్సరాంతం వరకు కొనసాగించాలన్న ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలి.

4. ప్రభుత్వ ఉపాధ్యాయులకున్న అన్ని సౌకర్యాలు ప్రభుత్వేతర ఉపాధ్యాయులకు వర్తింపజేయాలి. ఈలోగా సాగుతున్న రికవరీలను ఆపుదల చేయాలి.

5. వేతనాల సవరణ విషయంలో ఫేప్టో సూచనలను అమలుపరచాలి.

6. ఫేప్టో యిచ్చిన మెమొరాండంలోని డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి.

స్థలము : సంతకము

తేదీ : పాఠశాల :

## తూ. గో. జిల్లాలో ఉపాధ్యాయసంఘాల యాక్షన్ కమిటీ ఏర్పాటు

తూ. గో. జిల్లాపరిషత్‌లో గతంలో జరిగిన అక్రమ బదిలీల రద్దుకు 19-12-77 మరియు 13-2-78 తేదీలలో యు. టి. యఫ్. ఆధ్వర్యాన జడ్. పి, జిల్లాకలెక్టర్, డి ఇ. ఓ కార్యాలయాలముందు వందలాది ఉపాధ్యాయులు ధర్నాచేసి వాటినిరద్దు చేయించుకోవటం జరిగింది మరలయీ సంవత్సరం జరిగినఅక్రమబదిలీలరద్దుతోపాటు, జడ్. పి. డి ఇ ఓ. ఆఫీసులలో నున్న అపరిష్కృత సమస్యల పరిష్కారానికి, జిల్లాలోఉన్న అన్ని ఉపాధ్యాయ సంఘాలు శ్రీ డి. శివరామరాజు (యం. యల్. సి) ఆధ్వర్యాన 5-11-78 న కాకినాడలో సమావేశమై, జిల్లాయాక్షన్ కమిటీ ఏర్పాటుచేసుకొని 25-12-78 లోగా అక్రమబదిలీలు రద్దుచేసి, అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలనిలేనిచో ప్రత్యక్షచర్యకు ఉపక్రమించగలమని జిల్లా అఫీసర్లకు నోటీసుఇవ్వటం జరిగింది. ఫలితంగా జడ్. పి. అధికారులు యాక్షన్ కమిటీతోచర్చించి, అక్రమబదిలీల రద్దుకు, సీనియర్ హెడ్మాష్టర్లను సీనియర్ హైస్కూళ్ళలో నియమించటానికి అంగీకరించారు. దీనితో జిల్లా ఉపాధ్యాయవర్గానికి నూతనోత్సాహంకల్గింది. జిల్లాలోని అన్నిఉపాధ్యాయ సంఘాలను సమన్వయపరచి అన్ని విధాలా అండగా నిలబడిన శ్రీ డి. శివరామరాజుగారిని టీచర్లంతా అభినందిస్తున్నారు.

## అనపర్తిలో ఉపాధ్యాయులపై దౌర్జన్యం

అనపర్తి జిల్లాపరిషత్ హైస్కూలులో పనిచేయుచున్న శ్రీ యం. మార్కండేయులు బి ఏ బి.ఇ.డి, శ్రీ పి. భాస్కరరావు (హిందీ పండిట్)లపై శ్రీ గొలగూరి బాపిరాజు అనే భూస్వామి 18-10-78 తేదీ పాఠశాలలో ప్రవేశించి ప్రధానోపాధ్యాయుని సమక్షంలో దౌర్జన్యం జరిపి చంపుతానని బెదరించిన ఫలితంగా, భార్యాబిడ్డలను గ్రామాన్ని వదలి పైఉపాధ్యాయులు కాకినాడ వచ్చి తలదాచుకున్నారు. యు.టి.యఫ్. జిల్లా ప్రధానకార్యదర్శి ఈ విషయాన్ని జిల్లా కలక్టరుకు తదితర ప్రభుత్వాధికార్లకు తెల్పి. ఆఉపాధ్యాయులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు బదిలీచేసి, దోషిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాసనమండలి సభ్యులు శ్రీ డి. శివరామరాజు, ప్రధానకార్యదర్శి శ్రీ వి సూర్యనారాయణరాజు అనపర్తి వెళ్లి స్టాఫ్ మీటింగులో మాట్లాడి వాస్తవాలు తెలుసుకొని వచ్చారు. ఎట్టకేలకు ఆ ఉపాధ్యాయులను బదిలీచేసి, దోషిని అరెస్టుచేసి, కేసు నమోదు చేసినట్లు తెలుస్తున్నది.

ఉపాధ్యాయులపై జరిగిన ఈ అమానుష దాడిని విద్యార్థిమానులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఖండించి, రక్షణ కలిగించాలని యు.టి.యఫ్. రాష్ట్ర, జిల్లాశాఖలు కోరుతున్నాయి.

### యు. టి. యఫ్. పురోగమనం

తూ. గో. జిల్లా యు. టి. యఫ్. ఉపాధ్యాయ ప్రయోజనాలను రక్షించే పోరాట కార్యక్రమాలు, సాధించిన విజయాలు కళ్ళారాచూసిన జిల్లాలోని పెకండరీఉపాధ్యాయులు యు టి.యఫ్.లో చేరి మరింత ప్రోత్సాహాన్నివ్వాలని నిర్ణయించుకోవడమే గాకుండా ప్రతి హైస్కూలుకు రమ్మని ఆహ్వానిస్తున్నందుకు జిల్లాశాఖ హర్షిస్తోంది

# చెన్నుపాటి భవన ప్రారంభోత్సవం

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సుమారు లక్ష ఇరవై వేల వ్యయంతో విజయవాడ, గవర్నర్ పేట, పాలపర్తి వారి వీధిలో ఏర్పరచుకొన్న స్వంత కార్యాలయానికి డిశంబరు 9 న ప్రారంభోత్సవం జరిగింది. ఉపాధ్యాయ ఉద్యమ పితామహుండైన స్వర్గీయ శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్య పేరుబెట్టిన ఆ భవనానికి యు. టి. యఫ్ ఉపాధ్యక్షుడు, చెన్నుపాటి సహచరుడు అయిన శ్రీ నాదెళ్ళ సీతారామాచారి ప్రారంభోత్సవం చేశారు. సీనియర్ కార్యకర్త శ్రీ పి. వి సుబ్బరాజు ఉద్యమ పతాకను ఆవిష్కరించారు. శ్రీ కె. గంగిశెట్టి, శ్రీ కె అప్పలస్వామి పతాక గీతాన్ని గానం చేశారు. ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఆ ప్రారంభోత్సవానికి రాష్ట్రం నలుమూలలనుండి వందలాది ఉపాధ్యాయ కార్యకర్తలు, ఉద్యమాభిమానులు, ప్రజాసంఘాల నాయకులు, పురప్రముఖులు హాజరయ్యారు. పరిసరాలన్నీ రంగు కాగితాల తోరణాలతో, బ్యానర్లతో కళకళలాడుతూ ప్రత్యేకశోభ సమకూర్చినాయి.

అల్పాహారవిందు ముగిసిన తర్వాత ఆ భవనం ఆవరణలోనే శ్రీ చెన్నుపాటి పదవ వర్ధంతిసభ జరిగింది. యు.టి.యఫ్. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. వెంకటస్వామి షామియానాల ఆచ్ఛాదన క్రింద ప్రత్యేకంగా నెలకొల్పిన వేదికపైకి అతిథుల్ని ఆహ్వానించారు. శ్రీ మైనేని 'జోహార్' గేయంతో సభ ప్రారంభమయింది.

ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు శ్రీ ఎం.జె. మాణిక్యారావుగారు వర్ధంతిసభకు అధ్యక్షత వహించారు. కీ॥ శే॥ శ్రీ చెన్నుపాటితో గల తన పరిచయాన్ని వివరించి, ప్రజా సంఘాల నిర్మాణంలో చెన్నుపాటి సలహాల్ని తరచు తీసుకునే వాడినని, ఐక్య ఉద్యమానికి ఆయన నెలకొల్పిన సత్సాంప్రదాయాలు కార్యకర్తలందరికీ శిరోధార్యాలని ఉద్ఘాటించారు.

శ్రీ మోటూరి హనుమంతరావుగారుమాట్లాడుతూ, శ్రీచెన్నుపాటి తమచిరకాల మిత్రుడనీ, బ్రిటిష్ పాలనాకాలంలో రహస్యంగా ఉన్నప్పుడు ఆయన్ని వారిగ్రామంలో కలుసుకొన్నాననీ, యుద్ధకాలంలో వచ్చిన ఇబ్బందులకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులతరపున పోరాడుతూ, క్రమంగా వారిని సంఘటితపరచి రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్నినిర్మించాడని, అందుకేఆయన్ని 'చెన్నుపాటి' అనీ 'లక్ష్మయ్య



వర్ధంతి సభకు అధ్యక్షత వహించిన
శ్రీ యం. జె. మాణిక్యారావు (యం యల్ సి).



చెన్నుపాటి భవనాన్ని ఆవిష్కరిస్తున్న
శ్రీ యన్. సీతారామాచారి (ఉపాధ్యక్షుడు, యు టి యఫ్)

పంతులు' గారనీ, ఆప్యాయంగా పిల్చుకోవటం అలవాటయిందనీ, అదేసార్థకమై మరణించిన తర్వాతకూడా ఆయన 'ఉద్యమపితామహుడు' గా నిల్చిపోయాడనీ, ఆయనపేర భవనం నెలకొల్పటం ఉపాధ్యాయ లోకానికే గర్వకారణమని దానికి పూనుకొన్న యు. టి. యఫ్. అభినందనీయమనీ అన్నారు,

చెన్నుపాటి ఆదర్శ వ్యక్తిత్వాన్ని వివరిస్తూ శ్రీ చెన్నుపాటి మానవతావాది అనీ, అట్లని జాలిగుండెతో దిగాలుపడి నిర్లిప్తతతో ఉండటంగాక ఎంతటి కష్టాన్నైనా ధైర్యంతో ఎదుర్కొనేవాడనీ, భార్య మరణం తెలిసినా జరుపుతున్న సమావేశాన్ని వాయిదా వేయక కొనసాగించాడనీ, తన మరణం నిశ్చయమని తెలిసి స్వయంగా కోరి సంఘ కార్యాలయంలోనే మరణించాడనీ, చావంటే గాభరాపడని ఉన్నత వ్యక్తనీ ఉద్యమ నిర్మాతగా ఉత్తమ దేశభక్తుడుగా అందరికీ ఆదర్శప్రాయుడనీ ఉదాహరణలతో వివరించారు.

ప్రజాసంఘాల నిర్మాణంలో ఆయన సూత్రబద్ధవైఖరి అవలంబించాడనీ, ఆయన కాలంలో వేరు వేరు సంఘాలున్నా, వాటితో ఘర్షణలున్నా ఆయన ఐక్య ఉద్యమాన్ని నిర్మించటానికి కొన్ని మౌలిక సూత్రాల్ని అమల్లోకి తెచ్చాడని, ఎవరికే రాజకీయాలున్నా, భిన్నాభిప్రాయాలున్నా అందర్నీ సమస్యలపై కలుపుకుపోయాడని, ఎం.ఎల్.సి. ఎన్నికలు వచ్చినపుడు సభ్యులకు ఓటింగు స్వేచ్ఛ కల్పిస్తూ, ఉత్తమాశయాల్ని బలపరిచే సత్సాంప్రదాయాల్ని ఆయన నెలకొల్పాడనీ, వాటికి భిన్నంగా కొందరు అవకాశవాద వైఖరులు అవలంబించటం వల్లనే ఉద్యమంలో చీలికలు వచ్చాయని శ్రీ మోటూరు స్పష్టపరుస్తూ ఇలా వివరించారు.

జై ఆంధ్ర, జై తెలంగాణా ప్రాంతీయ ఉద్యమాలు చెలరేగినపుడు కొందరు ప్రాంతీయ దురభిమానాల వైపు కొట్టుకుపోయారు. ఐక్య ఉద్యమాన్ని ఛిన్నా భిన్నంచేశారు. దానిని కాదన్న ఎందరో సీనియర్ కార్యకర్తల్ని, జిల్లా సంఘాల్ని వెలివేశారు. అత్యవసర పరిస్థితి మెడమీద కత్తి బెట్టినపుడు వారంతా 20 పాయింట్లకు జోహుకుంశేశారు. ఈ విధంగా అవకాశవాద వైఖరుల్ని అవలం

లించినవారే ప్రస్తుతం తామే చెన్నుపాటి ఆశయాలకు వారసులమని చిందులు తొక్కుతున్నారు. ఐక్యతా సూత్రాల్ని ముందుకు తీసుకు పోయిన వారిని విచ్ఛిన్నకులని చీడపురుగులని తిట్టిపోస్తున్నారు. ఈ విధంగా తమ ప్రవర్తన యితరులకు అంటగట్టి అఘాయిత్యానికి పూనుకొంటున్నారు. వారే ముఠాలు గట్టి చెన్నుపాటి మరణశయ్యమీద ఉన్నపుడు, చనిపోయిన తర్వాత ఐక్య ఉద్యమానికి అడ్డంపడ్డారు. చెన్నుపాటిపై నీలాపనిందలు వేయటానికి కూడా వెనుకాడలేదని స్పష్టపరిచారు.

చెన్నుపాటి నెలకొల్పిన మౌలిక సూత్రాల్ని అమల్లో పెడుతూ ప్రాంతీయ దురభిమానాలకూ, అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడి విశాలైక్యత ప్రాతిపదికగా తెలంగాణాకు విస్తరించి అడుగడుగునా ఉపాధ్యాయుల హక్కులకోసం, విద్యారంగప్రయోజనాల కోసం నిలబడటంవల్లనే యు.టి.యఫ్. ఒక పోరాటశక్తిగా నిలబడింది. ఆ విధంగా సూత్రబద్ధ వైఖరి అవలంబించినంతకాలం ఏ ప్రజాసంఘమైనా పటిష్ఠంగా రూపొందుతుంది. నిరంకుశ పాలకులు వచ్చినా ఆ ఐక్య ఉద్యమాన్ని ఓడించలేరు. సమస్యలపై అన్ని సంఘాల్ని కలుపుకొని మరింత ముందుకు పోవాలంటూ శ్రీ మోటూరు ప్రబోధించారు.

శ్రీ యం. మాధవరావు (యం.యల్.సి.)గారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నవారిపేర తాపత్రయపడి ఊళ్ళపేర్లు భవనాలపేర్లు, సంస్థల పేర్లు పెడుతున్న కాలంలో చనిపోయినవారిపేర, అందులోనూ ఉద్యమంకోసం జీవితమంతా అర్పించిన వారిపేర భవనాన్ని నెలకొల్పటం గొప్పపని అనీ, ఈ చెన్నుపాటి భవనంలో ఐక్య ఉద్యమం మరింత ఉత్తేజంపొంది ముందుకు పోవాలని అన్నారు.

తర్వాత శ్రీ డి. శివరామరాజు (యం. యల్. సి) గారు మాట్లాడుతూ 'ఉత్తమ లక్షణాలుగల చెన్నుపాటి వంటివారు చాలా తక్కువమందే ఉంటారని, ఇతరుల సౌఖ్యంకోసం హక్కులకోసం ఆయన కొవ్వొత్తిలా కరిగిపోయి అందరికీ వెలుగిచ్చారని, యు.టి.యఫ్ సంయినకాలంలో సరయిన నిర్ణయం తీసుకొని ఆయన భవనం నెలకొల్పిందని అభినందించారు.

శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారు మాట్లాడుతూ పదవ వర్ధంతిసభ జరిపి శ్రీ చెన్నుపాటి ఆశయాలకు పునరంకితంగావటం సంతోషకర విషయమనీ, భవన నిర్మాణమే మనకు ప్రధానంగాదనీ, సాగించాల్సింది చాలావుందనీ, కార్యకర్తలు ఇతర ప్రజాసంఘాలతో సంబంధం పెట్టుకొని ఆత్మవిశ్వాసాన్ని, పోరాటశక్తినీ మరింత పెంపొందించుకోవాలని, ప్రజల మన్ననలు పొందినతర్వాతే ఏ ప్రజాసంఘమైనా పురోగమించగలదనీ, సమాజంలోని ఇతరవర్గాల సానుభూతిని అండదండల్ని సంపాదించగలిగినప్పుడే ఉపాధ్యాయులు తమ కోర్కెలు సాధించుకొనగల్గుతారని, హక్కులు సాధించుకొంటూనే నవసమాజ నిర్మాణానికి పూనుకోవాలని, ఎటువంటి నిర్బంధాలువచ్చినా తట్టుకొనే లక్ష్మయ్యలు వందల్లో తయారు కావాలని, రాష్ట్రంలో గల లక్ష ఏభైవేల ఉపాధ్యాయుల్ని ఒకే త్రాటిమీదికి తీసుకురావాలని, చదువుతున్న మీరు ప్రజలకు ఎంతో ఋణపడి ఉన్నారని, కుటుంబాన్ని పోషించుకుంటూనే ప్రజల్లో పని చేయాలని, అదే చెన్నుపాటి జీవితం మనకు నేర్పేదని శ్రీ సుందరయ్య తన ప్రసంగంలో పేర్కొన్నారు.

పిదప సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ టి వేణుగోపాలరావుగారు, ఆంధ్రప్రదేశ్ ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్

## 2,3,4,5 తరగతులకు అర్ధసంవత్సర పరీక్షాపత్రాలు సిద్ధంగా ఉన్నవి

ఉపాధ్యాయ సోదరీ, సోదరులారా !

గతంలో యు.టి.యఫ్. తూర్పు గోదావరి జిల్లాశాఖ పక్షాన ప్రచురించిన ప్రశ్నపత్రాలకు తీసుకొని ప్రోత్సహించిన మీ అందరికి అభినందనలు. మళ్ళీ 78 అర్ధసంవత్సర పరీక్షా పత్రాలు మీ సూచనలు, సలహాలమేరకు యస్. సి. ఇ. ఆర్. టి మోడల్‌లో తయారై సిద్ధంగా ఉన్నవి.

కార్యకర్తలు, అభిమానులు మరింత ప్రోత్సహించి సహకరించ ప్రార్థన. సొమ్ము ముందుగా పంపినవారికి పోస్టల్ ఖర్చులు ఉచితం.

రేట్లు : 2, 3, 4 తరగతులకు 0-30 పై.
5వ తరగతి (హిందీతో) 0-40 పై.

ఇట్లు,
ఎ. లెనోర, కరస్పాండెంట్
యు.టి.యఫ్. ఎగ్జామినేషన్ సెంటర్
ఎంప్లాయీస్ హోం, అమలాపురం-533201

## చెన్నుపాటి భవనానికి ఆయన కుటుంబ సభ్యుల విరాళాలు

చెన్నుపాటి భవన ప్రారంభోత్సవానికి పదవ వర్ధంతి సభకు విచ్చేసిన ఆయన కుమార్తె శ్రీమతి కల్పన అల్లుడు శ్రీ వెంకట్రావు రు. 116 లు. మనుమరాళ్లు అనిత, సునీత, స్రవంతి రు. 116 లు. కోడలు రూపీ, మనవరాలు వందిత రు. 116 లు. సోదరుడు సుబ్బారావు, మరదలు రూపీ రు. 116 లు, మిగిలిన బంధువులు తగురీతి విరాళాలు అందించారు. వారందరికి కృతజ్ఞతలు.

యు.టి.యఫ్.

(రిజిష్టర్డు) ప్రధానకార్యదర్శి శ్రీ డి. సత్యనారాయణరాజు సందేశాలిచ్చారు.

తర్వాత ప్రాథమిక విద్య సంపాదకులు శ్రీ యస్. యం. కొండయ్య మాట్లాడుతూ శ్రీ చెన్నుపాటిపై ప్రచారం చేయబడిన ఆర్థిక అరాచకత్వానికి చెందిన అపనిందల్ని ఖండిస్తూ, ఆ అకౌంట్ల స్వరూపాన్ని తేటపరిచారు. తాను గత నాలుగేండ్లుగా ఏ సంఘంలోనూ లేననీ ఇక యు. టి. యఫ్. లో చేరి ఉద్యమానికి తోడ్పడగలననీ వాగ్దానం చేశారు.

రాష్ట్ర సంఘ అధ్యక్షుడు శ్రీ కె. నారాయణరావు మాట్లాడిన తర్వాత ప్రధానకార్యదర్శి శ్రీ ఎ. వెంకటస్వామి వివిధ ప్రముఖులు పంపిన సందేశాలుచదివి వందనసమర్పణ గావించారు.

అమరజీవి చెన్నుపాటికి జోహార్ చెప్తూ సభ జయప్రదంగా ముగిసింది.

# కథలు గేయాలు

# అంతులేని కథ

— శ్రీ కె. కొండలరావు, కాకినాడ

ఆ స్కూల్లో ఇద్దరే పంతుళ్ళు

ఒకళ్ళు కావలా గాయటానికి, ఇంకొకళ్ళు ఓటర్ల లిస్టు రాయటానికి.

పంతులు బడి వాకిలి దాటాడో లేదో ....కప్పు ఎగిరిపోయేట్టు ఒకటే గోల.

పాపం....ఒక్కర్తే యేం చేస్తుంది పంతులమ్మ....అదిలించి, బెదిరించి, ఓపికచచ్చి, కిమ్మనకుండా కూర్చుంది .... పిల్లల గోలకు అలవాటుపడి.

ఒకళ్ళా....ఇద్దరా....వందమందికి కావలా గాయాలాయె.

పిల్లలకు తగిన పంతుళ్ళను నియమించరు....చదువుచెప్పటం లేదని మాత్రం నిందలు వేస్తారు!

ఆ పైన కోళ్ళ లెక్కలు....కుక్కల లెక్కలు....జనాభా లెక్కలు....మళ్ళియిప్పుడు ఓటర్ల లెక్కలు!

అన్నిటికీ పంతుళ్ళే!

—ఆలోచిస్తూ ఊళ్ళోకి వెళ్ళేరు బడిపంతులు.

'ఏవండీ!'—తలుపు తట్టేరు.

'ఎవరూ?' లోపలినుండి ఓ అనగొంతు

'నేనేనండి....పంతుల్ని!'

తలుపు తెరుచుకుంది. కొత్తగా వచ్చినకోడలు.

'ఓటర్ల లిస్టు వ్రాయటానికి వచ్చాను. పేర్లు చెప్తారా?'

'మాఅత్తావాళ్ళు ఊళ్ళోలేరు....రేపురండి!'—

'అలాగ్గానండి వరసగా ఒక్కొక్క ఇల్లూ వ్రాయాలి!

తలుపు ధడేలుమంది జవాబుగా.

అదిరిపడి....గుండె దడదడలాడి....యింకో యింటికి వెళ్ళేరు కాళ్ళీడ్చుకొంటూ

అక్కడ ఓ ముసలాయన కూర్చున్నాడు.

ఓట్లు రాయటానికి వచ్చాను!

'మునిసిపల్ ఎలక్షనా?'

ఆ యింటాయనకు ఆశపుట్టింది.

పదిమంది పేర్లు చెప్పేరు వరసాగ్గా

'ఓట్లు—నోట్లు!'—మనసులో గొణుక్కొంటున్నాడాయన

మూడోయింట్లో ఓ ముత్తయిదువ

ఆవిడ చాప వేసి మరీ కూర్చోబెట్టింది.

ఇక దండకం వల్లించ సాగింది.

'మావీధి వాళ్ళంతా ఓట్లువేస్తే ఓమరుగుదొడ్డి కట్టిస్తానన్నాడు వ్రాసిదొంగ బడిచేసోడు. మరుగుదొడ్డీలేదు... మందులదొడ్డీ లేదు... గెల్చిన తర్వాత మళ్ళీ అయిపులేడు, ఇంకా ఎందుకు ఓట్లు?'—ప్రశ్నించింది. కావవార్తలు పెడుతూ.

'ఓట్లు వద్దుమాకు!' నిష్కర్షగా చెప్పిందావిడ. ఎంతనచ్చచెప్పినా వినిపించుకోలేదు.

చాలా యిళ్ళల్లో అవే ప్రశ్నలు

"సైడ్ కాల్వలు కట్టిస్తానన్నారు!

మాకులు తీయిస్తామన్నారు?

రోడ్లు.... వీధిదీపాలు....ఏవీ?

— అదే పలుగురు వారుకి.

పంతులు నోరు ఎండిపోయింది. వాళ్ళకు జవాబులు చెప్పలేక

"ఒక ఊళ్ళోనే ఏమిటి?

దేశమంతటా అదే జరుగుతున్నది"

అధికార పీఠం ఎక్కటానికి ఎన్నికల వాగ్దానాలు! ఆశలు పెట్టి ఆకాశానికెక్కించటం!

ఆ పైన వాటి ఊసే ఉండటంలేదు.

ఓడ దాటిందాకా ఓడ మల్లయ్యా!

ఆ తర్వాత బోడి మల్లయ్యా!"

— గొణుక్కుంటూ ప్రొద్దుగూకిందాకా ఇల్లిల్లూ తిరిగి ఓటర్ల నమోదుచేసి ఇంటికిచేరి ఉస్సూరుమంటూ కూర్చున్నాడు పంతులు.... కుక్కిమంచం మీద.

మళ్ళీ ఉసుళ్ళ పుట్టలూ .... కందిరీగల తుట్టెలా ఒకటే ఆలోచనలు.

"వెధవ గాడిద చాకిరీ!

మునసబు కరణాలకు,పంచాయతీ బోర్డుగుమాస్తాలకు యీపని అప్పజెప్పకూడదూ? పంతుళ్ళే దొరికారా? అనుకొంటూ

అలా పడ్డి వాల్చాడోలేదో "మునసబుగారు ఓటర్ల లిస్టు పట్టుకు రమ్మంటున్నారని యముడిలా వచ్చిపడ్డాడు ఆ ఊరి తలారి.

* * *

"కూర్చోండి!" ఎప్పుడూ లేని మర్యాద,

"ఓటర్ల లిస్టు వ్రాస్తున్నారట! పూర్తయిందా?" మళ్ళీ కుశల ప్రశ్న.

"ఇదిగో పూర్తయినట్టే... ఫెయిర్ కాపీ వ్రాయాలి!"

"ఏదీ....యిటివ్వండి!" అధికార స్వరంతో ఓ ఆర్డరు.

'మాలపల్లెలో ఇంతమందున్నారా? వీటిని సగానికి తగ్గించాలి' మళ్ళీహుకుం.

'అదెలా?' మాటపెగలని ప్రశ్న.

'ఎలాగా... ఏం పంతులివయ్యా!'—ఓ హేళన.

'ఇదిగో... ఈ పాతికపేర్లూ మాయింట్లో వ్రాయండి!'

'ఉన్నపేర్లు తొలగించనండి!' ఎలాగో ధైర్యంచేసి అన్నాడు పంతులు.

'వెధవవేషాలేయక అవి కొట్టేసి....ఇవివ్రాయి....నా సంగతి తెలుసుగా!'—మళ్ళీ సుగ్రీవాజ్ఞ.

రక్షించాల్సినవాడే భక్షిస్తున్నాడు

కంచే చేను మేస్తున్నది.

పిల్లలు అల్లరిగాపాడే దసరాపాటగుర్తుకువచ్చింది పంతులికి.

'చాక దగ్గరపెట్టి దవడూడగొట్టి

చెట్టు దగ్గరపెట్టి చెంపూడగొట్టి

అయ్యయ్యో పంతులూ, అయిపోయినావా!'

'ఏమిటి ఆకాశంవంక చూస్తున్నావ్? కాఫీయ్!

—బెదిరిస్తూ తనే లిస్టులో పేర్లు కొట్టేసి.... తన ఇంట్లో ఓ పాతికమందిని వ్రాసి 'ఇకపద అన్నాడు' మునసబు.... అ హ్హ హ్హ అని అట్టహాసం చేస్తూ,

ఏం చేయాలి?

ఎవరికిచెప్పాలి?

ముందునూయి... వెనకగోయి!

—ఆ రాత్రి కునుకుపట్టక నిద్రిస్తున్న భార్యాబిడ్డల్ని అదే పనిగా చూస్తూ, కూర్చున్నాడు ఆందోళనతో అతను.

ఎంత ఆలోచించినా తనకథకుఅంతం కన్పించలేదు... అందరి పంతులికి.

## భా వి పౌ రు లు!

— కె. ఆర్. లలిత, శ్రీరామపురం.

అడుగు పెట్టాను తరగతి గదిలోనికి
ఆశయాల ఆవేశంతో.
అందించారు పిల్లలు
అర్థంకాని సాంఘికశాస్త్రం
ఉన్నాయి నిండుగా గ్రీనిచ్‌లు, గ్రీన్‌లాండులు
ఈ యులలూగే పసిపాపల
ఊహల కందని విషయాలని
ఊపిరాడనీయకుండా(?) ఇష్టంలేక
పోనీ తీయండి "సామాన్యం" అన్నాను.
అందులోనూ సాక్షాత్కారం
సప్తఋషి మండలజాలం
'పోనీ.... తెలుగో....!' అన్నాను నీరసపడిపోతూ
"హ స్తమున కయ్యవారి బెత్తమునకు
పలుపు దాస్యమ్మునుండి మోక్షమ్మునంది....
........"కోడిపుంజుల దెందు"........
తక్కువ మూగాను పుస్తకాన్ని
'ఏమి చెప్పాలి?
ఏమని చెప్పాలి?
యెలా చెప్పాలి?
—అస్తవ్యస్తమైన మస్తిష్కంలోని
అలలవంటి ప్రశ్నలన్నీ
ముడివడిన్న భృకుటిలోన
మునుగుకోవడం చూసి
వన్నె తరిగిన గులాబీల్లా
వసివాడిన మల్లెల్లా
నీరసించి
నీరుగారి
నిలబడ్డారు—
నేటి బాలలు - మన భావిపౌరులు!

# లంచానికి జై!

(వ్యంగ్య రచన)

— శ్రీ కె.యస్.

అయ్యయ్యో! చూశారా యీ విడ్డూరం!

"లంచగొండితనం నశించాలట!"

పనీ పాటా లేకపోతే సరి... గొంతు చించుకొంటే నశిస్తుందా?

అచెప్పుకొనేదేదో నెమ్మదిగా... శాంతంగా చెప్పుకోగూడదూ?

పెద్దవాళ్ళ మనసులు నొచ్చుకొంటాయనే ఆలోచనైనా లేకుండా ఏంటా గావుకేకలు!

"నశించాలి!"

"నిర్మూలించాలి!" ఆ మాటలు వింటుంటూనే నాకు ముళ్ళ మీద కూర్చున్నట్టుంటుంది. నవ్వు కంపర మెత్తుతుంది.

అందులో లంచాన్ని నిర్మూలించేది!

వీళ్ళ తరమవుతుందా?

అమ్మమ్మా... ఎంత గొప్ప "శక్తి" అది.

'అమ్మమ్మా... మామూలు.... దనువు.... దక్షిణ.....బహుమతి!'—దేవుడికి ఎన్ని పేర్లున్నాయో ఆ మహాశక్తికి అన్ని పేర్లున్నాయి. ఇందుగలదందులేదని సందేహము వలదని ఎందెందు వెదికి చూచిన అందందే కన్పిస్తుందని గిరీశంకూడా అన్నాడు.

అంత మంచిదాన్ని 'నశించా'లంటారా?

అదేం విన్నటిదా.... మొన్నటిదా!

లంచం పుచ్చుకోవటం అతి ప్రాచీనమైన ఆచారమనటానికి నాదగ్గర సవాలక్ష ఆధారాలున్నాయి.

అవసరమైతే దానిమీద పరిశోధనచేసి డాక్టరేట్ కూడా పుచ్చుకోగలను.

అతిప్రాచీన కాలంనుండీ ఆనూచానంగావస్తున్న పూజలూ... పురస్కారాలూ....బలులూ... ఆఖరికి ఏడుకొండలవాడికిచ్చే తలనీలాలూ....హుండీలో పడే బ్లాక్‌మనీ....ఇదంతా ఏమిటంటారు?

ఇంకా ఉదాహరణలు కావాలా?

'రాముడు తాను పట్టాభిషిక్తుడుకావటానికి పౌరోహిత వర్గానికి లంచం యిచ్చినట్టు రామాయణంలో ఉంది,'

'చెలికత్తెలు తనమీద ఏం చాడీలు చెప్తారోనని శ్రీకృష్ణుడు లంచాలిచ్చి లోబరచుకున్నాడని సత్యభామ స్వయంగా చెప్పుకున్నది

పెద్దవారిదగ్గరకు నేరుగా పోకుండా ఫలం....పత్రం... పుష్పం తోయం అని ఊరికే అన్నారా?

—ఇలా సవాలక్ష ఉదాహరణలున్నాయ్

అదీగాక ఇది రాకెట్ యుగం.

అంతా స్పీడ్....స్పీడ్!

అందుకని అయిదో....పదో అవతల పారేసేదీ....అవసరమైన పని అర్జెంటుగా చేయించుకొనేదీ!

ఈ సంఘాలూ....చట్టబండలూ అనవసరం. ఎందుకంత శ్రమ?

ఆధునికయుగ లక్షణాన్ని మనం ఒంటబట్టించుకోకపోతే.... అది మన 'చాదస్తం' తప్ప మరొకటి కాదు.

'లంచానికి జై' అని బయటి కంటే తంతారనుకొంటే... లోలోపల తిరుమంత్రంలా జపించండి. లం....చా....ని...కీ....జై!

# మనము మన ఆరోగ్యము



## గుండె దడ

డా॥ యమ్. రామారావు,
ప్రజావైద్యశాల, విజయవాడ-2

గుండె ఎప్పుడూ కొట్టుకొంటూనే ఉంటుంది. కాని మనకు ఆ స్పృహ ఉండదు. ఛాతీమీద చెయ్యి వేస్తేనో, నాడి చూస్తేనో అది మనకు తెలుస్తుంది. అదేమీ లేకుండా గుండె దడదడా కొట్టుకుంటున్నట్టు తెలిస్తే దాన్నే "గుండెదడ" అంటారు. గుండె జబ్బుల వల్ల వచ్చే గుండెదడ అకస్మాత్తుగా వస్తుంది.

రక్తహీనతలో కూడా ఈ గుండెదడ తరచుగా కనిపిస్తుంది. థైరాయిడ్ గ్రంథి హెచ్చుగా పనిచేసినపుడు కూడా గుండెదడ వస్తుంది. భయం, మానసిక బలహీనతలున్న వారిలో ఈ దడ హెచ్చుగా ఉంటుంది.

సైనోసిస్ : కొంతమందిపిల్లలు గుక్కబట్టినపుడు ముఖం నల్లబడుతుంది. అలా శరీరమంతాగాని, శరీరంలో ఒక భాగంగాని నల్లబడటాన్ని 'సైనోసిస్' అంటారు.

రక్తంలో బొగ్గుపులుసు వాయువు హెచ్చుగా ఉన్నప్పుడు రక్తం నల్లగా ఉంటుంది. దాన్నే 'చెడురక్తం' అంటారు. ఊపిరితిత్తులలో బొగ్గుపులుసు వాయువును విసర్జించి ప్రాణ వాయువును తీసుకొన్న తర్వాత రక్తం ఎర్రగా అవుతుంది. రక్త పరీక్షకోసం దాన్ని తీసినపుడు కొందరు 'నా రక్తం చాలానల్లబడిపోయింది, చాలా చెడిపోయింది. ఏదో పెద్దజబ్బే' అని భయపడతారు. కానీ, రక్త పరీక్షకు ఎప్పుడూ Venoms Blood తీస్తారు. అందువల్ల నల్లగా ఉంటుంది అదిజబ్బువల్లగాదు, ఒకటి, రెండు చుక్కలుకావల్సివచ్చినప్పుడు వేలుచివరతీస్తారు. అప్పుడు మాత్రం రక్తం ఎర్రగానే ఉంటుంది.

కొన్నిజబ్బుల్లో రక్తంలో ప్రాణవాయువు పాళ్ళుతక్కువగా ఉన్నపుడు శరీరం కూడా నల్లబడవచ్చు. (1) ఊపిరితిత్తుల జబ్బుల్లో ప్రాణవాయువు మార్పిడి సరిగా జరగనపుడు (2) పుట్టుకతో వచ్చే కొన్ని రకాల గుండె జబ్బులున్నపుడు (3) రక్తానికి చెందిన కొన్ని జబ్బులున్నపుడు 'సైనోసిస్' రావచ్చును. కాళ్ళను వేళ్ళను రక్త ప్రసరణ సరిగా లేనప్పుడు ఆ భాగాలు నల్లబడవచ్చు.

– గుండె సరిగా పని చేయనపుడు సిరలు ఉబ్బుతాయి. ముఖ్యంగా మెడలోని సిరలు ఉబ్బి ఉండటం హార్ట్ ఫెయిల్యూర్ లక్షణాలలో ఒకటి

వ్రేళ్ళ చివరలు, గోరు క్రింద ఉబ్బి గుండ్రంగా తయారు కావటాన్ని Clubiry అంటారు. దీర్ఘకాలంగా ఉన్న కొన్ని గుండె జబ్బుల్లో ఈ లక్షణం ఉంటుది.

నాడి : గుండె ముకుళించి నపుడల్లా రక్తం రక్తనాళాల్లోకి వస్తుంది. గుండె వ్యాకోచించేటప్పుడు కొత్త రక్తమేదీ రక్తనాళాల్లో ప్రవేశించదు. మళ్ళీ గుండె ముకుళించినపుడు మరింత రక్తం నాళాల (ధమనులు) లోకి ప్రవేశిస్తుంది. గుండె సంకోచ వ్యాకోచాల వల్ల రక్తనాళాల్లో (ధమనుల్లో) రక్తం అలలుగా ప్రవహిస్తుంది. ధమని మీద మన చేతివ్రేళ్ళు ఉంచినపుడు దానిలో రక్తం అలలుగా ప్రవహించటాన్ని మనం గుర్తించగలం. ఒక్కొక్క అల గుండె ఒక్కసారి సంకోచించటానికి సంకేతం.

ఆరోగ్యంగా వున్న వ్యక్తిలో గుండె నిమిషానికి 72 సార్లు కొట్టుకొంటుంది. కాబట్టి నాడి కూడా 72 సార్లు కొట్టుకుంటుంది. శ్రమచేసిన తర్వాత, భయపడ్డప్పుడు, Incot అయినపుడు గుండె వేగంగా కొట్టుకొంటుంది. కాబట్టి నాడి వేగం పెరుగుతుంది. జ్వరం వచ్చినపుడు కూడా నాడి వేగం పెరుగుతుంది. మామూలు శరీరోష్ణోగ్రత 98.4% అంతకుమించి శరీరోష్ణోగ్రత 1% పెరిగితే నాడి వేగం నిమిషానికి 10 సార్లు పెరుగుతుంది. టైఫాయిడ్‌లోను, మరి కొన్ని గుండె జబ్బుల్లోను నాడి వేగం తగ్గుతుంది. ఎక్కువ వ్యాయామం చేసేవారిలోను, క్రీడాకారుల్లోను నాడివేగం తక్కువగా వుంటుంది.

నాడి చూడటం ద్వారా గుండె కొట్టుకొనే క్రమాన్ని (రిథం) కూడా అర్థం చేసుకోవచ్చు. నాడిలో ఒక అలకు మరొక అలకు మధ్య నుండే సమయం సమానంగా ఉంటుంది. కొన్ని గుండె జబ్బుల్లో అది సమానంగా ఉండదు. కొన్ని సందర్భాలలో ఒక అల పెద్దదిగాను, మరొక అల చిన్నదిగానూ ఉండవచ్చు.

నాడి చూడటం ద్వారా రక్తనాళాల్లో ప్రవహిస్తున్న రక్తం యొక్క ప్రమాణాన్ని గుర్తింపవచ్చు. విరోచనలు, వాంతులు అవటంవల్ల ఎక్కువ రక్తస్రావం జరిగినపుడు రోగి "షాక్"లో ఉన్నపుడు రక్తప్రమాణం తగ్గటంవల్ల నాడి సన్నగా బలహీనంగా ఉంటుంది. నాడివల్ల రక్తనాళాలలో రక్తం ఎంత వత్తిడితో ప్రవహిస్తుందో కూడా తెలుసుకోవచ్చు.

★

### ముఖ్య గమనిక – అడ్రసు మార్పు

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యాలయం, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కార్యాలయం విజయవాడ బందరురోడ్డు లోని రాఘవయ్య పార్కుకు ఎదురుగాగల పాలపర్తివారి వీధిలోగల "చెన్నుపాటి భవనం"లోకి మారింది. ఇకముందు ఉత్తరాలు, యం. ఓ. లు, ఇతర కరస్పాండెన్సు అంతా యీక్రింది అడ్రసులకే పంపించ కోరుచున్నాను.

| | |
|---|---|
| ఐక్య ఉపాధ్యాయ<br>పాలపర్తివారి వీధి<br>విజయవాడ - 2 | ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్<br>పాలపర్తివారి వీధి<br>విజయవాడ - 2 |

చెన్నుపాటి భవనప్రారంభోత్సవానికి వచ్చిన కార్యకర్తలకు, ఉద్యమాభిమానులకు అందరికీ అభివందనలు — యు.టి.యఫ్.

# ప్రశ్నోత్తరాలు

శ్రీ యన్. సీతారామాచారి ఉపాధ్యక్షుడు, యు. టి. యఫ్.

## శ్రీ డి. ప్రభాకర్, గుంటకల్, అనంతపురం జిల్లా

ప్రశ్న: నేను తే 1-4-73 నుండి హైయ్యర్ స్టార్టు రూ. 126/-తో సెకండరీగ్రేడు పోస్టులో పని చేస్తున్నాను. జి.ఓ. యం.యస్ నెం. 766 ఎడ్యుకేషన్ తే 27-3-73 మరియు గవర్నమెంటు మెమో నెం. 1306-కె 1/75-1 ఎడ్యుకేషన్ తే. 2-5-75 మేరకు 1969 స్కేళ్ళలో ఓవర్ పేమెంట్సు లేవు. ఇటీవల వచ్చిన 1120 ఎడ్యుకేషన్ (కె) డిపార్టుమెంటు తే. 7-12-1977 మేరకు నేను కూడా అడ్వాన్సు యింక్రిమెంట్లతో బాటు, ఒక అడిషనల్ యింక్రిమెంటు గూడ పుచ్చుకొనుటకు వీలున్నదా? వివరముగా తెలియజేయండి.

జవాబు: లేదు. అటువంటి అవకాశము మీకు లేదు. అది ఓవరు పేమెంట్సుయుండి రికవరీ చేయబడిన వారికి మాత్రమే వర్తించగలదు. ఈ జి.ఓ. 2వ పేరాలో "The Government after careful Examination of the problem in all aspects with a view to metigate the hardship of recovery hereby direct that the Secondary Grade Teachers in the 1969 scale of Rs. 96-200 and who had the benefit of higher start of Rs. 126/- for aquiring additional qualifications prior to 1-1-74 shall be allowed at the time of fixation of pay in the revised pay scale of 1974 one additional increment in addition to the advance increments to which they would be eligible according to the orders allready issuad in G. O. M. S. No 928 Edn dated 13-9-1977" అనియును, "The sanction of on additional increment referred to above, is subject to the condition that the over payments in the 1969 scale of pay due to non-absorption of advance inevements are recovered now from the concerned teachers" అనియును ఉన్న ఆదేశములను పరిశీలించండి.

## శ్రీ యం. ఆర్. కృష్ణమూర్తి, ప్రొద్దుటూరు, గుంటూరు.

ప్రశ్న: నేను గుంటూరు జిల్లా పరిషత్‌లో గ్రేడు II పండిట్‌గా 18-6-73 నుండి పనిచేయుచున్నాను. కానినేను 1-7-74న డి.యస్.సి. అయితిని నాకు శలవు అర్హత ఏ తేదీనుండి వచ్చును?

జవాబు: శలవు, సీనియారిటీ, రెగ్యులరైజేషన్ మొ॥ అన్ని విషయాలలో అపాయింటుమెంటు తేదీనుండే లెక్కించుటకు ప్రభుత్వము "చలో హైదరాబాద్" సందర్భంగా హామీయిచ్చింది. త్వరలో ఉత్తర్వులు రాగలవు.

## శ్రీ యస్.వి.యస్.ఆర్. సత్యనారాయణమూర్తి,

ఇరుసుమండ, తూ. గో.

ప్రశ్న: 1978 సం॥రంకు ముందు వెసక్టమీ ఆపరేషన్లు చేయించుకున్న వారికి అదనపు యింక్రిమెంట్లు పొందే అవకాశం లేదా?

జవాబు: ప్రస్తుత ఉత్తర్వుల ప్రకారం లేదు. అందుగురించి ప్రభుత్వానికి రిప్రజెంటు చేశాం.

## శ్రీ మాగాపు సత్యనారాయణమూర్తి,

పొడగట్లపల్లి తూ గో.

ప్రశ్న: సింగిల్ టీచరు విద్యా సం॥రంలో ఎన్ని దినములు పనిచేయాలి.

జవాబు: అందరిలాగే 220 రోజులు పనిచేయాలి. అయితే సెలవులు పెట్టుట కారణా వల్ల తగ్గించొ డి. ఇ. ఓ. కు కండోనేషన్‌కు వ్రాసుకోవాలి. copy of the Letter 3793-11-65 of 11-9-65 Govt of A.P. చూడండి.

## శ్రీ టి. సుబ్బారావు, మేదుఖాదు, ప్రకాశంజిల్లా

ప్రశ్న:- ముగ్గురు ఉపాధ్యాయులుగల పాఠశాలలో సెకండరీగ్రేడు యోగ్యతకు తక్కువ యోగ్యతలు గల ఆ ఉపాధ్యాయుల పైన సర్వీసు గలిగిన ఎలిమెంటరీగ్రేడు ఉపాధ్యాయుడు హెడ్మాస్టరుగా పనిచేయవచ్చునా? దానికి సంబంధించిన రూలు యున్న యెడల తెలియజేయండి,

జవాబు:- పనిచేయుటకు అభ్యంతరములేదు. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ రూల్సు 50(3) నిబంధన మేరకు నలుగురు అంతకు మించి ఉపాధ్యాయులున్న పాఠశాలలకు మాత్రమే సెకండరీగ్రేడు ట్రయిండు టీచర్లు హెడ్మాస్టర్లుగా నియమించబడవలెను తప్ప, అంతకు తక్కువ ఉపాధ్యాయులుగల పాఠశాలలకు హైయ్యరు ఎలిమెంటరీ గ్రేడు ఉపాధ్యాయులుగూడ హెడ్మాస్టర్లుగా నియమించబడవచ్చును.

ప్రశ్న: ఒక ఉపాధ్యాయిని రెండవ కాన్పులో మెటర్నిటీ శలవు పెట్టుకొనగా, ఆఫీసువారు ఆమె సంపాదించుకొన్న సంపాదిత శలవుపోను మిగిలిన రోజులకు మెటర్నిటీ శలవు మంజూరు చేసియున్నారు. అట్లు చేయవచ్చునా? చేయుటకు వీలులేని యెడల ఆ సంపాదిత శలవుకొరకు యెవరికి అపీలు చేసుకొనవచ్చును:

జవాబు: ఆ ఉపాధ్యాయిని నాన్ పర్మనెంటు అయి యున్న యెడల ఆమె పెట్టుకొన్న మెటర్నిటీ శలవులో ఆమెకు నిలువలో నున్న సంపాదిత శలవును మొదట మంజూరుచేసి మిగిలిన కాలమునకు మెటర్నిటీ శలవు మంజూరు చేయవచ్చును అయితే ఆమె పర్మనెంటు లేక అప్రూవుడు ప్రొబేషనరు అయినప్పుడు, సంపాదిత శలవుతో సంబంధంలేకుండా, పూర్తిగా మెటర్నిటీ శలవు మంజూరు చేయవలెను. ఫండమెంటల్ రూల్సు 101 (ఎ) క్రిందనున్న 1 వ సహాయకరూలును పరిశీలించండి ఆమె పర్మినెంటు లేక అప్రూవుడు ప్రొబేషనరు అయినప్పుడు, మెటర్నిటీ సెలవు సందర్భములో మంజూరు గాబడిన సంపాది శలవును నిలువలోనికి చేర్చవలసినదిగా మంజూరు అధికారికి దరఖాస్తు పెట్టించండి. న్యాయము జరుగనప్పుడు. ఆయనపైన అప్పిల్‌మెంట్. అథారిటీకి అప్పీలు చేయించి న్యాయము సంపాదించుటకు కృషిచేయండి.

---

## యు. టి. యఫ్. అభ్యర్థి ఎన్నిక

అర్బన్ రేంజి భీమవరం సెంటర్ సమావేశం 2-12-78 న శ్రీ పి. నారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. 1979 సం॥నకు సెంటర్ కార్యదర్శి ఎన్నికకు జరిగిన పోటీలో యు. టి. యఫ్. అభ్యర్థి శ్రీ కె. గౌరీపతి 24 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆరోజున జరిగిన కార్యవర్గ సమావేశంలో యు. టి. యఫ్. అభ్యర్థి విజయానికి తోడ్పడిన కార్యకర్తలందరినీ అభినందించటం జరిగింది.



# నియమ నిబంధనలు!

## ఉద్యోగ సంఘాల గుర్తింపు

**శ్రీ బి. నరసింహారావు**

ఉద్యోగ సంఘాల గుర్తింపును గురించి చాలామంది కార్యకర్తలు వేగిర పడుతున్నారు. మాది "గుర్తింపుగల సంఘ"మని కొందరు గొప్పలు చెప్పుకొంటున్నారు. అధికారులు కూడా ఆ గుర్తింపును "ఒక అర్హత"గా కొన్నిజిల్లాల్లో పరిగణిస్తున్నారు. అసలు గుర్తింపు ఎవరినుండి రావాలి? ఉద్యోగులనుండా? ప్రభుత్వంనుండా? ఈ వివాదం తెల్పేదే ఈ వ్యాసం.

"జి ఓ యం.యస్. నెం 1144 జనరల్ ఎడ్మినిష్ట్రేషన్ (సర్వీసెస్ 'సి') తేదీ 8-9-1962" ఉద్యోగ సంఘాల గుర్తింపుకు చెందిన ప్రభుత్వ ఉత్తర్వు. దీనిలోనే దానికి చెందిన నియమ నిబంధనలున్నాయి.

దీనిలో ఉద్యోగ సంఘాల గుర్తింపుకు అవసరమైన అంశాల వివరణకన్న దానిరద్దుకు దారితీసే పరిస్థితుల వివరణే చాలఎక్కువగా వుంది.

"ఉద్యోగ పరిస్థితుల (కండిషన్, అఫ్ సర్వీస్)కు, తత్సంబంధ విషయాలకు సంబంధించి రిప్రజెంటేషన్ చేసేందుకు ఏ ఉద్యోగ సంఘాన్నయినా ప్రభుత్వం గుర్తింపవచ్చు. అలా గుర్తించేందుకు కొన్ని షరతులున్నాయి.

1) ఉద్యోగసంఘం ఒక ప్రత్యేక తరగతి ఉద్యోగులతో కూడిఉండాలి. ఆ తరగతిఉద్యోగులందరికి దానిలో సభ్యత్వానికి అవకాశాలు ఉండాలి.

2) తన సభ్యుల సాధారణ ఉద్యోగప్రయోజనాల (కామన్ సర్వీస్ఇంటరెస్ట్స్) దోహదానికి ఆసంఘం ప్రధానంగాఏర్పడిఉండాలి.

3) ఒకకులం, తెగ లేక మతం ప్రాతిపదికగా ఆ సంఘం ఉండరాదు.

4) సంఘసభ్యుల చందాలు ప్రభుత్వగ్రాంటులు(ఏమైనాఇస్తే) సంఘప్రయోజనాలకే అవధులుపరిమితమైఉండాలి. అదిసంఘలక్ష్యాల కొరకు మాత్రమే వినియోగింపబడాలి.

5) ఆసంఘానికి చెందిన విషయాలు (ఎఫైర్స్) లో ఉద్యోగి గాని వ్యక్తికి ఎవరికీ సంబంధం ఉండరాదు.

## ఉద్యోగసంఘాల గుర్తింపురద్దు

ఉద్యోగసంఘాల గుర్తింపునియమాలలోని 3(2)నియమాలలో ఉద్యోగసంఘానికి ఈయబడిన గుర్తింపు రద్దుకుదారి తీసేపరిస్థితులు సుదీర్ఘంగా ఈయబడినాయి. వీటిని ఉద్యోగులు తెలుసుకోవటం అవసరం. ఆత్మగౌరవం, ఆత్మాభిమానం ఉన్న ఏసంఘమైనా అంగీకరించడానికి వీలులేని అనేక షరతులు అందులో ఉన్నాయి.

గుర్తింపు రద్దుగాకుండా వుండాలంటే ఉద్యోగసంఘం చేయ గూడని పనులు యీ క్రిందివిధంగా వివరింపబడ్డాయి.

**1. ఏఒక్క ఉద్యోగి వ్యక్తిగత సమస్యల్ని సంఘం తీసుకోగూడదు. ఆ సమస్యల్లో సభ్యుణ్ణి బలపరచగూడదు.**

2. తన సభ్యుల సమస్యల్ని, ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు సంఘం ఏ రాజకీయపార్టీ, లేక రాజకీయవేత్త సాయం తీసుకో గూడదు.

3. తన సమావేశంలో సంఘ సభ్యుడుగాని ఏ వ్యక్తిని మాట్లాడనీయ గూడదు.

4. ఇతర ఉద్యోగ సంఘాలతో సమిష్టిసమావేశాలు ఏర్పాటు చేయగూడదు. అలా చేయాలనుకున్నప్పుడు ముందుగా ప్రభుత్వాను మతి పొందాలి.

5. సంఘ సభ్యులుగాని, సంఘ పదవులు నిర్వహించేవారు గాని ఏ యితర సంఘ కార్యక్రమాలలో పాల్గొనకూడదు.

6. సంఘం సమ్మెలు, ప్రదర్శనలు నిర్వహింపగూడదు. వాటికి సహాయపడగూడదు. (నియమంలో మాత్రం శాంతి భద్రతలకు భంగం కలిగించే సమ్మెలు ప్రదర్శనలు అనిఉన్నది, కాని ఆచరణలో యీ నియమం అసలు సమ్మెను, ప్రదర్శనను నిర్వహింపకుండ నిరోధింప గల్గుతుంది.)

7. ముందుగా ప్రభుత్వానుమతి పొందకుండ పత్రికనుగాని, బులెటిన్‌ను గాని సంఘం ప్రచురింపగూడదు.

8. సంఘం తన సమావేశాలకు పత్రికా విలేఖరులను రానీయ గూడదు.

9. ప్రభుత్వం ఆదేశించిన విధంగా సంఘం తన నియమాలను, నిబంధనావళిని (బైలాస్) మార్చుకోవాలి.

10. నియమాలలోగాని, నిబంధనావళిలోగాని ముఖ్యమైన మార్పులు చేయదలచినప్పుడు సంఘం ముందుగా ప్రభుత్వానుమతి పొందాలి.

11. ఇంకొక సంఘంతోగాని, సమాఖ్య(ఫెడరేషన్)తో గాని అనుబంధం (అఫిలియేషన్) పొందదల్చినప్పుడు ప్రభుత్వానుమతి పొందాలి.

12. స్వరాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలకుగాని, ఏ యితర రాష్ట్ర ప్రయోజనాలకుగాని, కేంద్రప్రభుత్వ ప్రయోజనాలకుగాని భంగకరమని ప్రభుత్వం భావిస్తే పత్రికనుగాని, బులెటిన్‌నుగాని సంఘం ప్రచురించటం ఆపివేయాలి.

13. గుర్తింపు పొందిన సంఘం కొన్ని సంఘాల సమాఖ్య అయినట్లయితే అందులో గుర్తింపు పొందని సంఘం ఉండరాదు. గుర్తింపు రద్దుచేయబడిన సంఘాన్ని వెంటనే దానినుండి తొలగించాలి.

(14) ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అమలు పరచాలి. విధించిన షరతులను ఆమోదించాలి.

— ఇవీ ఆ జి. ఓ. లోని నియమాలు వీటినిబట్టి ఆలోచించండి.

ప్రభుత్వ గుర్తింపు అవసరమా?

లేక పిడికోపాధ్యాయుల గుర్తింపు అవసరమా?

# చర్చా వేదిక

## బదిలీ కోడ్

శ్రీ యన్. వి. బసవయ్య

ఉపాధ్యక్షుడు, గుంటూరుజిల్లా యు.టి.యఫ్.

నవంబరు సంచికలో చర్చకు ప్రతిపాదించిన బదిలీ కోడ్‌పై పలువురు అభిప్రాయాలు పంపేరు. వాటిని వరుసగా ప్రకటించగలము. సం॥

ఐక్యఉపాధ్యాయ నవంబరు సంచికలో యు.టి.యఫ్. సూచించిన బదిలీకోడ్ విపులంగా వున్నది. దానిలో ఇంకనూ చేర్చవలసిన విషయాలను ఉపాధ్యాయుల దృష్టికి తెస్తున్నాను.

1. సౌకర్యాలనుబట్టి విభజనలో ఎ బి.సి.డి. అను నాల్గు తరగతులుగా చేయాలి. డి క్లాసు అంటే అచ్చట ఏ సౌకర్యమూ లేని ప్రాంతంగా భావించాలి. వాటిని పనిష్మెంటు ఏరియాగా భావించాలి.

2. అవివాహితులను, వితంతువులకు వారు కోరుకొన్న చోటుకు బదిలీ చేయుటకు 3 సం॥ల వరకు మాత్రం అవకాశం యిచ్చుట మంచిదికాదు. అంగవైకల్యం అంటే నిర్వచన వుండాలి. పూర్తిగా నడవలేని వారికి, లేక పక్షవాతం మొ॥ దీర్ఘవ్యాధిగల వారికి మాత్రమే వారు కోరుకొన్న చోటుకు వేసే అవకాశం యివ్వాలి.

3. (ఎ) భార్యాభర్తల విషయంలో – ఇద్దరిలో ఏ ఒక్కరికి 5 సం॥ల నిబంధన కాలం పూర్తియైననూ, ఇద్దర్నీ ఇంకొక చోటికి లేక 2 మైళ్ళ లోపు ప్రాంతానికి బదిలీ చేయాలి.

(బి) అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌పై ఏ ఒక్కరిని చేయవలసి వచ్చినా, ఇద్దర్నీ బదిలీ చేయాలి. ఉదా॥ ఒక పోష్టు తగ్గినది. అక్కడున్న లాంగ్‌స్టాండింగ్ వ్యక్తి భార్యాభర్తలలో ఒకరై వుంటారు. భార్యాభర్తలనే కారణంతో జూనియర్‌ను బదిలీచేయరాదు. ఆ భార్యాభర్తలను కదిలించి వేరొకచోటికి బదిలీచేసినట్లైన సరియైన న్యాయము జరుగును.

4. పరస్పర బదిలీవిషయంలో ఎ క్లాసులోని వారిని ఎ క్లాసులోనికి, అలాగే తతిమ్మావారిని బదిలీ చేయాలి అట్లు పరస్పర బదిలీలు జరిగినను, ఆ 'ఎ' క్లాసులోని రెండుచోట్ల కలిపి 5 సంవత్సరాలు నిండిన తదుపరి 'బి' క్లాసుకు బదిలీ చేయాలి.

(బి) 'ఎ'క్లాసులో 5 సంవత్సరాలు నిండిన తదుపరి ఇంకొక చోటుకు వెళ్ళవలసి వచ్చునవే భయంతో పరస్పర బదిలీలకు అప్లై చేయవచ్చు. అంటే ఆ టీచరు ఎల్లప్పుడూ 'ఎ' క్లాసులోనేవుండే విధానము జరుగుతోంది. కాన 'ఎ' నుండి 'బి' క్లాసుకు పోవుటకు మాత్రమే అంగీకరించాలి. లేనిచో 'డి'క్లాసులోని వారు బాధపడతారు.

5. కులమత ప్రాతిపదిక : బదిలీల విషయంలో కుల, మత ప్రాతిపదికలపై ప్రత్యేక సౌకర్యాలు చూపరాదు. ఉపాధ్యాయులందరూ ఒకేకులముగానూ, ఒకేవిధమైన ఆర్థికవనరులు కలవారుగా పరిగణించాలి. రూల్సు అందరికీ సమానంగా వర్తింప జేయాలి. కష్ట సుఖాలను అందరూ సమానంగా పంచుకోవాలి.

6. ఉపాధ్యాయులు ఏకారణం చేతనైనా సెలవు పెట్టినట్లైన ఆ సెలవు పోస్టులలో టెంపరరీ వారిని వేసి, సెలవు అనంతరం ఆ ఉపాధ్యాయుని తన ఒరిజినల్ ప్లేసుకు వేయాలి. టెంపరరీ వారిని ఇంకోచోటికి వేయవచ్చు లేదా ఊస్టు చేయవచ్చు.

7. అన్ని బదిలీలు అనగా రిక్వెస్టులు, మ్యూచుయల్సు, రిటైర్‌మెంటు వేకెన్సీలు మొ॥ అన్నింటినీ వేసవిసెలవుల్లోనే పూర్తి చేయాలి. పాఠశాలలు తెరచిన తరువాత ఏ ట్రాన్సఫర్‌గూడా జరగరాదు. ఒకవేళ ఎడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్సుపై బదిలీ అయితే, అట్టి ఉపాధ్యాయుల బిడ్డలకు (ఏ మేనేజిమెంటు స్కూలు అయినా సరే) స్పెషల్ ఫీజు, ట్యూషన్ ఫీజులు ఎంగ్జమ్షన్ యివ్వాలి.

8. బదిలీలు కేటగిరీ వారిగా జరగాలి. అనగా సెలక్షన్ గ్రేడ్‌లను పొందే వారిని ఇతరులతో కలపరాదు. ఎలిమెంటరీలో సీనియారిటీ ప్రకారం హెడ్మాష్టర్లుగా వేసి, ఆ హెడ్‌మాస్టర్ల మధ్యనే బదిలీలు జరగాలి.

9. అభియోగాలు :– ఏ ఉపాధ్యాయునిపైనయైనా అభియోగములున్నట్లయిన, ఆ అభియోగాలను 1 నెలరోజుల లోగా విచారణ జరగాలి. నెలరోజులలో విచారణ జరుపకపోయినట్లయిన ఆ అభియోగాలు రద్దయినట్లుగా భావించాలి. లేనిచో అభియోగముల పేరుతో సంవత్సరాల తరబడి ఎంక్వయిరీలంటూ బాధ పెడతారు. అభియోగములురుజువైనట్లయిన, ఏ అలవెన్సులేకుండా డి ప్రాంతమునకు పనిష్మెంటుపై బదిలీచేయాలి. లంచగొండి అధికారులు పక్షపాత బుద్ధితో మంచి ప్లేస్‌కు వేయుట జరుగరాదు.

యు. టి. యఫ్. గత సంచికలో సూచించిన వాటికి పైవిషయాల సవరణలతో జతపరచి నిర్ణయాలు చేయునప్పుడు ఆలోచించవలసినదిగా నా సూచన.

శ్రీ కె. సుబ్బారావు, భట్టిప్రోలు.

మీరు సూచించిన బదిలీకోడ్ ఐటం నెం. 3 లో 'భార్యాభర్తలిరువురు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ భర్త రిటైర్‌అయి స్థిరనివాస మేర్పాటు చేసుకొన్న గ్రామానికి భార్యనుకూడ బదిలీచేయాలి' అనే విషయాన్నికూడ చేర్చగోరుతున్నాము.

---

**9–9–78 న G. O. 886 మీద ట్రిబ్యునల్ తీర్పు**

R. P. 1685/77 and 1333/77
I136/77/1685/77
R. M. P : SNO : /136/932 of 1977
Y. Srinivasa Sastry (Advocate)

**తీర్పు సారాంశము**

